సాక్షి
నిజామాబాద్
శుక్రవారం, 7, జూన్, 2024



మండుతున్న ధరలు

కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. ఆకాశాన్నంటిన ధరలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



మోక్షమెప్పుడు..

బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.1 /26.8

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం పలు ప్రాంతాలలో వర్షం కురిసే అవకాశాలున్నాయి.

నామినేటెడ్ పైరవీలు

నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. జిల్లా ముఖ్య నేతలు కార్పొరేషన్ చైర్మన్ పదవులను కోరుతూ హైదరాబాద్ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. స్థానిక సంస్థల పదవుల విషయంలోనూ పలువురు నాయకులు దృష్టి సారించారు. ఈ పదవులకు సైతం పోటీ బాగానే ఉంది.



- రాజధాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు
- లాబీయింగ్ చేస్తున్న ఆశావహులు
- స్టేట్ కార్పొరేషన్, జిల్లా స్థాయి పదవుల కోసం పోటాపోటీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఎన్నికల కోడ్ ముగియడంతో జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నామినేటెడ్ పదవుల కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన మరునిముషం నుంచే ఆశావహులు హైదరాబాద్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఎవరి స్థాయిలో వారు పైరవీలు చేస్తున్నారు.

■ నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారిలో జిల్లా నుంచి బాడ్సి శేఖర్‌గౌడ్, కేశ వేణు, గడుగు గంగాధర్, ముప్ప గంగారెడ్డి, ధర్మపురి సంజయ్, అంతిరెడ్డి రాజిరెడ్డి, బాస వేణుగోపాల్ యాదవ్, సయ్యద్ ఖైసర్, జావెద్ అక్రం, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, గోర్త రాజేందర్, ఏబీ శ్రీనివాస్ తదితరులు రేసులో ఉన్నారు. కేశ వేణు, బాడ్సి శేఖర్‌గౌడ్, ధర్మపురి సంజయ్ స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. ఇక జిల్లాలో కీలకమైన నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, నిజామాబాద్ మార్కెట్ కమిటీ, ఇతర మార్కెట్ కమిటీలు, ఆలయ కమిటీలు, వక్ఫ్ బోర్డ్, గ్రంథాలయ చైర్మన్ తదితర పదవుల కోసం కొందరు పార్టీ శ్రేణులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

■ఇదిలా ఉండగా పార్లమెంట్ ఎన్నికలకు ఒక రోజు ముందు ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డికి తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్‌కు తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకేట అన్వేష్‌రెడ్డికి తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ పదవులు దక్కాయి. వీరు ముగ్గురూ బాల్కొండ నియోజకవర్గానికి చెందిన వారే కావడం గమనార్హం. వీళ్లతో పాటు బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాసుల బాలరాజుకు తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవి లభించింది. అంతకు ముందే నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన తాహెర్‌బిన్ హందాన్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులయ్యారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌కు పార్టీ నాయకత్వం శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పించింది. మరోవైపు నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందిన షబ్బీర్ అలీకి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చారు. ఒక ఎమ్మెల్సీ, ప్రభుత్వ సలహాదారు, ఐదు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు కలిపి మొత్తం ఏడు పదవులు జిల్లా నాయకులకు రావడం విశేషం.

చైర్మన్ పదవులపై..

మరోవైపు కీలకమైన స్థానిక సంస్థల పదవుల విషయంలోనూ పలువురు నాయకులు కన్నేసి ఉంచారు. ఈ పదవులకు సైతం పోటీ బాగానే ఉంది. జెడ్పీ చైర్మన్, మేయర్, మున్సిపల్ చైర్మన్ల విషయానికి వస్తే.. మండలం, డివిజన్, వార్డు రిజర్వేషన్లతో పాటు చైర్మన్ పీఠానికి రిజర్వేషన్లు, మహిళా కోటా కేటాయింపులు ఉన్న నేపథ్యంలో ఆశావహుల్లో గుబులు నెలకొంది. ఈ క్రమంలో ప్రభుత్వ నామినేటెడ్ పదవులైతేనే మేలనే ఆలోచన చేస్తున్నవారు సైతం ఉన్నారు.

న్యూస్‌రీల్

నిజాంసాగర్ కాలువ బుంగకు మరమ్మతులు



నిజాంసాగర్: మహమ్మద్‌నగర్ మండల కేంద్ర శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువకు పడిన బుంగను నీటి పారుదల శాఖ అధికారులు పూడ్చివేశారు. నిజామాబాద్, బోధన్ పట్టణ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకోసం ఈనెల 4న నిజాంసాగర్ ప్రాజెక్టునుంచి నీటి విడుదల చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ప్రధాన కాలువకు మహమ్మద్‌నగర్ శివారులో బుంగ పడడంతో నీరు వృథా అయ్యింది. దీంతో అధికారులు నీటి విడుదలను నిలిపివేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆ పనులు గురువారం పూర్తవడంతో తిరిగి నీటి విడుదల చేపట్టారు. 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రధాన కాలువ వైపు రైతులు, పశువుల కాపరులు వెళ్లవద్దని నీటి పారుదలశాఖ అధికారులు సూచించారు.

ఎస్సారెస్పీని సందర్శించిన ఎస్ఈ



బాల్కొండ: ఎస్సారెస్పీని ఎస్ఈ శ్రీనివాస్ గుప్తా గురువారం సందర్శించారు. ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ)గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ప్రాజెక్ట్‌ను సందర్శించి, వివరాలు తెలుసుకున్నారు. వరద గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి నీటి చుక్క సద్వినియోగమయ్యేలా చర్యలు తీసుకోవాల్నారు. ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి, డిప్యూటీ ఈఈ గణేశ్, ఏఈఈలు వంశీ, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి



నవీపేట: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గణేశ్‌రావ్, హెచ్‌ఎంలు అనురాధ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- సకాలంలో యూనిఫామ్‌లు అందించేలా చర్యలు
- సీఎస్ శాంతికుమారితో వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డితో కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రూప్–1 పరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. వానాకాలం సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో 12,833 మంది అభ్యర్థులు పరీక్ష రాయనుండగా, 41 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బయోమెట్రిక్ హాజరు స్వీకరణ కోసం ప్రత్యేకంగా ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం

జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు, విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే 6700 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పంపిణీ చేశామని, మరో 830 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ కోసం సిద్ధంగా ఉన్నాయని వివరించారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్ ఇతర అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎరువులు, విత్తనాల నిల్వలు పూర్తి స్థాయిలో ఉన్నందున, ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ డీలర్లు, వ్యాపారాలు కృత్రిమ కొరత సష్టించకుండా గట్టి నిఘా పెడుతున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా విద్యార్థులకు యూనిఫామ్‌లు అందించేలా కృషి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 1,10,746 యూనిఫామ్‌లు అవసరం ఉండగా ఇప్పటి వరకు 47,409 జతలు సిద్ధం అయ్యాయని చెప్పారు. మిగతా వాటిని ఐదు రోజుల వ్యవధిలో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన సీఎస్ దృష్టికి తెచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో తరుణ్ చక్రవర్తి, డీఈవో దుర్గాప్రసాద్, గ్రూప్–1 పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త రామ్మోహన్ రావు, మెప్మా పీడీ రాజేందర్, విత్తన అభివద్ధి సంస్థ అధికారి శ్రీకర్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆర్‌ఎంపీ, పీఎంపీలపై నజర్!

- 50 బృందాలతో తనిఖీలు
- నిబంధనలు పాటించాలని హెచ్చరిక

నిజామాబాద్ నాగారం: నిబంధనలు పాటించకుండా కొనసాగుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాలపై వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆర్‌ఎంపీ, పీఎంపీ కేంద్రాలు, ఆస్పత్రుల్లో తనిఖీల కోసం 50 బృందాలను ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు ఈ బృందాలు వారం రోజుల పాటు ప్రథమ చికిత్స కేంద్రాలు, ప్రైవేట్‌ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టనున్నాయి. జిల్లాలో గత పదేళ్లుగా ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌లు అధిక సంఖ్యలో వెలిశాయి. వైద్యం మాట దేవుడెరుగు కమీషన్ల కోసమే కొంతమంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేసి దర్జాగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఎలాంటి అర్హత లేకుండానే ఇంజక్షన్‌లు, సెలైన్లతో చికిత్స అందిస్తున్నారు. వాస్తవానికి ఆర్‌ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. వచ్చీరాని వైద్యం చేయడమే కాకుండా కమీషన్‌లకు కక్కుర్తి పడి అమాయకులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. దీంతో అధికారులు తనిఖీలు చేపట్టి వారి లెక్క తేల్చనున్నారు.

విజిట్ డాక్టర్ పేరిట..

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు వందల సంఖ్యలో పుట్టుకొచ్చాయి. కనీస నిబంధనలు పాటించకుండానే హాస్పిటల్ ఏర్పాటు చేస్తున్నారు. విజిట్ డాక్టర్ పేరుతోనే మల్టీ, సూపర్‌స్పెషాలిటీ పేర్లు పెట్టుకొని వైద్యం చేయిస్తున్నారు. ఆర్‌ఎంపీ, పీఎంపీలకు కమీషన్లు ఇచ్చి గ్రామీణ ప్రాంతాల రోగులను రప్పించుకుంటున్నారు. చిన్న రోగమైనా టెస్టులు, వైద్యం పేరిట రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. దీంతో డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌ల లెక్క తేల్చడానికి ప్రత్యేకంగా నిఘా పెట్టారు. 50 బృందాలతో జిల్లాలో తనిఖీలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నాలుగు రోజులుగా ఆయా బృందాలు తనిఖీలు చేపడుతున్నాయి. మరో మూడు రోజుల పాటు తనిఖీలు కొనసాగనున్నాయి. ఒక్కో బృందంలో డాక్టర్, పారామెడికల్, సూపర్‌వైజర్ ఉంటారు. వారు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్నారు.



మెడికల్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

లెక్క తేల్చడానికే..

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ, పీఎంపీల క్లినిక్‌ల లెక్క తేల్చడానికే తనిఖీలు చేపడుతున్నాం. మరో మూడు రోజులు తనిఖీలు కొనసాగుతాయి. తనిఖీ బృందాలు ఇచ్చే నివేదిక ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– తుకారాం రాథోడ్, డీఎంహెచ్‌వో

హరితహారానికి సన్నద్ధం

- నైరుతి రుతుపవనాల రాకతో మొక్కలు నాటేందుకు మొదలైన పనులు
- గుంతలు తవ్వించాలని ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు
- ఈ ఏడాది 25 లక్షల మొక్కలు నాటనున్న గ్రామీణాభివృద్ధి శాఖ

డొంకేశ్వర్(ఆర్మూర్): నైరుతి రుతుపవనాలు జిల్లాను తాకడంతో మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. పదో విడత హరితహారానికి అధిక లక్ష్యాన్ని నిర్దేశించుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తును ప్రారంభించింది. గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలను ఉపాధిహామీ కూలీలతో తవ్వించాలని ఎంపీడీవోలు, ఏపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలో అనువైన స్థలాలను గుర్తించి అంచనాలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

■ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 44.67 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం ఉండగా, గ్రామీణాభివృద్ధి శాఖకు 25.11లక్షలు టార్గెట్ ఉంది. ఇందుకు గతేడాది నవంబర్ నెలలోనే 530 నర్సరీల్లో విత్తనాలు వేసి 55 లక్షల వరకు మొక్కలను పెంచుతున్నారు. ప్రస్తుతం అవి పెరిగి నాటడానికి సిద్ధంగా ఉన్నాయి. గతేడాది మిగిలిన మొక్కలు చాలా వరకు నర్సరీల్లో ఉన్నాయి. ప్రతి పంచాయతీకి పదివేల మొక్కలను పెంచిన అధికారులు ఆ జీపీ పరిధిలో 3,700 చొప్పున మొక్కలు నాటాలని లక్ష్యాన్ని పెట్టుకున్నారు. అయితే ఈ నెల 10 నుంచి గ్రామాల్లో గుంతల తవ్వకాన్ని వేగవంతం చేయాలని ఇటీవల గూగుల్‌మీట్‌లో ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. కూలీలను పూర్తిగా గుంతలను తవ్వడానికి ఉపయోగించాలని సూచించారు. కొలతల ప్రకారం గుంతలను తవ్వినందుకు కూలీలు రోజుకు రూ.300 వరకు ఉపాధిని పొందే అవకాశం ఉంది. ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా గుంతలను తవ్వి సిద్ధంగా ఉంచాలని, ప్రభుత్వ ఆదేశాలు రాగానే మొక్కలు నాటాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. అత్యధికంగా బోధన్ ఉమ్మడి మండలానికి 1,71,524 మొక్కలు, అత్యల్పంగా చందూర్ మండలానికి 23,570 మొక్కలు నాటాలని లక్ష్యం ఉంది.



డొంకేశ్వర్ మండలం అన్నారం నర్సరీలో పెరిగిన మొక్కలు

నర్సరీల్లో చాలా రకాల మొక్కలు

పదో విడత హరితహారం కోసం గ్రామీణాభివృద్ధి శాఖ నర్సరీల్లో చాలా రకాలైన మొక్కలను పెంచుతోంది. మునగ, వేప, నిమ్మ, దానిమ్మ, ఎర్రచందనం, కానుగ, చింత, టేకు, ఈత, జామ, ఖర్జురా, అల్లనేరుడు లాంటి వెరైటీ మొక్కలను పెంచుతున్నారు. వీటితో పాటు గుల్‌మోహార్, గులాబీ, తెల్ల జిల్లేడు లాంటి పూల రకాల మొక్కలను సైతం పెంచారు. ఇంటికి ఐదు చొప్పున పూల రకాల మొక్కలను హరితహారంలో ఇవ్వనున్నారు. తొలకరి వానలు పడడంతో గ్రామాల్లో గుంతలు తవ్వించాలని మండల, గ్రామ స్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చామని డీఆర్‌డీవో సాయాగౌడ్ తెలిపారు.



మండలాల వారీగా నాటే మొక్కల లక్ష్యం..

మండలం	టార్గెట్	మండలం	టార్గెట్	మండలం	టార్గెట్
ఆర్మూర్	1,02,738	కమ్మర్‌పల్లి	71,574	నందిపేట్	1,61,304
బాల్కొండ	52,582	కోటగిరి	1,31,108	నవీపేట్	1,48,228
భీమ్‌గల్	1,24,356	మాక్లూర్	1,30,804	నిజామాబాద్	83,552
బోధన్	1,71,524	మెండోరా	54,448	రెంజల్	84,186
చందూర్	23,570	మోర్తాడ్	55,238	రుద్రూర్	48,634
ధర్పల్లి	1,02,480	మోస్రా	25,044	సిరికొండ	1,30,614
డిచ్‌పల్లి	1,54,610	మోపాల్	96,868	వర్ని	97,150
ఇందల్వాయి	1,06,690	ముప్కాల్	37,582	వేల్పూర్	93,154
జక్రాన్‌పల్లి	1,01,616			ఎడపల్లి	82,852
				ఏర్గట్ల	38,860

పదోన్నతులు, బదిలీలకు వేళాయే..

- కసరత్తు చేస్తున్న విద్యాశాఖ
- త్వరలో షెడ్యూల్!

నిజామాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖలో పదోన్నతులు, బదిలీల సందడి నెలకొంది. ఎన్నికలు ముగియడంతో దీనికి సంబంధించిన ప్రక్రియ మళ్లీ తెరపైకి వచ్చింది. పాఠశాలలు ప్రారంభం కానున్న తరుణంలో కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులు రానున్నాయి. ప్రస్తుతం ఈ ప్రక్రియకు సంబంధించి కసరత్తు జరుగుతోంది. నేడో, రేపు బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు విడుదల కానుంది. దీనికి సంబంధించి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా విద్యాశాఖలో 4,890 మంది ప్రభుత్వ టీచర్లు ఉన్నారు. పదోన్నతుల కోసం అర్హత ఉన్న వారు ఇదివరకే దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో అన్ని సబ్జెక్టులకు సంబంధించి పదోన్నతులకు 267 పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. 1:3 ప్రకారం పదోన్నతులకు సంబంధించి ప్రక్రియ కొనసాగనున్నది. షెడ్యూల్ విడుదల కాగానే దరఖాస్తుల స్వీకరణ, ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నారు. జిల్లా విద్యాశాఖ ఆయా పాఠశాలల నుంచి ఖాళీల వివరాలను సేకరించింది. దీని ప్రకారమే పదోన్నతులు కొనసాగనున్నాయి.

కొన్నేళ్లుగా నిరీక్షణ

కొన్నేళ్లుగా బదిలీలు లేకపోవడంతో ఒకే చోట కొనసాగుతున్న ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన బదిలీలు ఎన్నికలు కోడ్ రాగానే నిలిచిపోయాయి. కొందరిని రిలీవ్ చేయగా మరికొందరు అలాగే ఉండిపోయారు. ప్రస్తుతం అలా కాకుండా ముందుగా పదోన్నతులను చేపట్టనున్నారు. అనంతరం ఏర్పడిన ఖాళీల ప్రకారం బదిలీలు జరగనున్నాయి. ఆరు నుంచి తొమ్మిదేళ్లుగా ఒకే చోట కొనసాగుతున్న వారిని తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. రెండేళ్లకు పైబడి ఒకే చోట కొనసాగుతున్న ఉపాధ్యాయుల వివరాలన్నింటినీ జిల్లా విద్యాశాఖ గుర్తించింది.

కోర్టు తీర్పుల మేరకు..

పదోన్నతుల విషయంలో విద్యాశాఖ కోర్టు కేసులతో జాగ్రత్తగా వ్యవహరించనుంది. 2010 కంటే ముందు ఉద్యోగం పొందిన ఎస్జీటీలకు టెట్ అవసరం లేదని కోర్టు పేర్కొంది. అలాగే ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల్లో టీటీసీ చేసిన వారికే ఇవ్వాలని సూచించింది. గెజిటెడ్ హెచ్‌ఎంలకు టెట్ అవసరం లేదని చెప్పింది. ఇలాంటి అంశాలను పరిగణలోకి పదోన్నతులు, బదిలీలు చేపట్టనున్నారు.



జిల్లాలో పదోన్నతి పోస్టుల వివరాలు

పోస్టు	పీఆర్ విభాగం	ప్రభుత్వ విభాగం
ఎస్ఏ మ్యాథ్స్	10	1
ఎస్ఏ ఫిజిక్స్	3	1
ఎస్ఏ బయోసైన్స్	33	5
ఎస్ఏ సోషల్ స్టడీస్	73	7
ఎస్ఏ తెలుగు	18	5
ఎస్ఏ హిందీ	14	4
ఎస్ఏ ఇంగ్లిష్	13	3
పీఎస్ హెచ్ఎం	75	2
మొత్తం	239	28

అలాగే ఇటీవల రిటైర్డ్ అయిన గెజిటెడ్ హెచ్‌ఎంలు 23 మంది వరకు ఉన్నారు. ఈ ఖళీలను కూడా పరిగణలోకి తీసుకుంటే మరికొంత మందికి ప్రమోషన్ వచ్చే అవకాశం ఉంది.

షెడ్యూల్ వస్తే చేస్తాం



బదిలీలు, పదోన్నతులకు సంబంధించి షెడ్యూల్ రాగానే ప్రక్రియ మొదలు పెడతాం. సంబంధిత వివరాలతో సిద్ధంగా ఉన్నా. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రక్రియ చేపడుతాం. – దుర్గాప్రసాద్, డీఈవో

రేపు జాతీయ లోక్ అదాలత్

ఖలీల్‌వాడి: జాతీయ లోక్ అదాలత్‌ను ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతా కుంచాల ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో భాగంగా నిజామాబాద్‌లో ఐదు, బోధన్‌లో నాలుగు, ఆర్మూర్‌లో రెండు బెంచ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లా వ్యవసాయాధికారితో సాక్షి ఫోన్‌ఇన్



విషయం: వర్షా కాలంలో ఏ సమయంలో విత్తనాలు, వరి నాట్లు వేయాలి. ఎరువులు, విత్తనాల లభ్యత, నకిలీ విత్తనాల సరఫరా, వరి నారుమడుల్లో సమస్యలు, తదితర అంశాలపై రైతులు ప్రశ్నలు అడగవచ్చు.

తేది: 08-06-2024 (శనివారం)

సమయం: ఉదయం 10.00 గంటల నుంచి 11.00 గంటల వరకు..



వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

ఫోన్ చేయాల్సిన నంబర్: 72888 94567/ 99594 12852

క్లుప్తంగా

జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై మహేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న మున్సిఫ్ కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాజీ చేసుకోదగ్గ కేసులకు సంబంధించి కక్షి దారులు లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు.

భారీ వర్షానికి దెబ్బతిన్న ఇల్లు



ఇందల్వాయి: మండల వ్యాప్తంగా మంగళవారం కురిసిన భారీ వర్షానికి ఇందల్వాయి గ్రామానికి చెందిన గొల్ల సాయవ్వ అనే మహిళ ఇల్లు కొంత మేరకు దెబ్బ తినగా శుక్రవారం ఉదయం కూలి పోయింది. ప్రమాదంలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని, ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించినట్లు ఆర్ఐ మోహన్ తెలిపారు.

గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: గుర్తింపు లేని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలలపై అడ్మిషన్ల పేరిట అధికంగా వసూలు చేస్తున్నాయని అన్నారు. వీటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరా రు. కళాశాలల్లో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి,నాయకులు కుశాల్,టోకు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి



పీర్యా(ఫైల్)

రెంజల్: పిడుగుపాటుకు ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని దండిగుట్టలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దండిగుట్టకు చెందిన మాలోత్ పీర్యా(65) తన పశువులను మేత కోసం తీసుకెళ్లాడు. సాయంత్రం వాటిని ఇంటికి తీసుకొస్తున్న సమయంలో భారీ ఈదురు గాలులు, వర్షం కురవడంతో చెట్టుకింద పశువులను వదిలి అక్కడే నిల్చున్నాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో పీర్యా అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

సొంత భవనాలకు మోక్షమెప్పుడు..?

- స్థల సేకరణ జరిగేనా..
- బడ్జెట్‌లో రూ. 1546 కోట్లు కేటాయించిన సర్కార్
- అధికారులు నిర్లక్ష్యం వీడితేనే బీసీ గురుకులాలు బాగు



మోర్తాడ్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాల

మోర్తాడ్(బాల్కొండ): ప్రాథమికోన్నత స్థాయి నుంచి మాధ్యమిక స్థాయి వరకు ఉచిత వసతితో పాటు విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా సంస్థలను ఏర్పాటు చేసింది. కాగా మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం వాటి నిర్మాణ దిశకు అడుగులు ముందుకు వేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో బీసీ గురుకుల పాఠశాలలకు రూ.1,546 కోట్ల నిధులను కేటాయించింది. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కోడ్ ఎత్తివేశారు. ఈ నేపథ్యంలో బీసీ గురుకుల పాఠశాలల భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించాల్సి ఉంది. 2017–18 విద్యా సంవత్సరానికి గాను నియోజకవర్గానికి ఒక బాలుర, బాలికల గురుకుల పాఠశాలలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. మొదట్లో పదో తరగతి వరకే విద్యా బోధన అందించినా దశల వారిగా ఇంటర్‌ను ప్రవేశపెట్టారు. బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటులో భాగంగా మోర్తాడ్, ఖుద్వాన్‌పూర్(ఆర్మూర్), ఆర్మూర్, బాల్కొండ, భీమన్‌పల్లి, ఎడపల్లి, నిజామాబాద్, బోధన్‌లో పాఠశాలలు కొనసాగుతున్నాయి.

ఐదు నియోజకవర్గాల్లో పది గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ ఏడేళ్ల కాలంలో వీటికి సొంత భవనాలు నిర్మితం కాలేదు. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా భవనాల నిర్మాణానికి నిధులను మంజూరు చేయలేదు. ప్రతి పాఠశాలకు కనీసం ఐదు ఎకరాల స్థలం అవసరమని బీసీ గురుకుల పాఠశాలల యాజమాన్యం నిర్ధారించింది. ప్రతి పాఠశాలలో 400 నుంచి 500 మంది విద్యార్థులకు విద్యా బోధన అందిస్తున్నారు. ఇంటర్ వరకు ఉన్న చోట డిగ్రీ కూడా అమలు చేసే అవకాశం ఉంది. కేజీ టూ పీజీ విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం అనేకమార్లు వెల్లడించింది. బీసీ గురుకులాలకు సొంత భవనాలు అందుబాటులోకి వస్తే పీజీ వరకు విద్యా బోధన అందించడానికి అవకాశం ఉంటుంది.

సీఎం తక్షణమే రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహించి తక్షణమే రాజీనామా చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలను నిర్వహిస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆనాడు బలిదేవత సోనియమ్మ అని విమర్శించిన రేవంత్‌రెడ్డి.. నేడు తెలంగాణ తల్లి అని, ఆమె పుట్టిన రోజున తెలంగాణ తల్లి ఉత్సవాలు నిర్వహిస్తామనడం సిగ్గుచేటన్నారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ చీకటి ఒప్పందంతోనే కాంగ్రెస్‌కు 8 ఎంపీ సీట్లు వచ్చాయని, ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం స్కామ్‌లపై రేవంత్‌రెడ్డితో కేసీఆర్‌కు ఒప్పందం కుదిరిందని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం గ్యారెంటీల అమలుపై దృష్టిసారించాలన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. సమావేశంలో నాయకులు, కార్పొరేటర్లు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, మాస్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు చేస్తే సహించం

- రాష్ట్ర కో–ఆపరేటింగ్ ఛైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: ఎంపీ అర్వింద్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోమని, ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో–ఆపరేటింగ్ ఛైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ అర్వింద్ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మత రాజకీయాలు చేసిందని విమర్శించారు. జిల్లాలో గెలవనని తెలిసి మోదీ జపంతో అర్వింద్ గెలిచారన్నారు. ఎన్నికల్లో అర్వింద్ ప్రతి గ్రామంలోని మహిళలకు రూ. 300 పంచారని వాటి వీడియోలను ఎన్నికల కమిషన్‌కు అందజేస్తామన్నారు. మామిడిపల్లి, మాధవ్‌నగర్ వద్ద చేపడుతున్న రైల్వే బ్రిడ్జి పనులు ఇంత వరకు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధిలో సుదర్శన్ రెడ్డి పాత్ర ఎంతో ఉందని అన్నారు. జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తులుగా మారడంతోనే కాంగ్రెస్‌కు ఓట్లు తక్కువ వచ్చాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కేశవేణు, అంతిరెడ్డి రాజారెడ్డి, రత్నాకర్, వేణురాజ్, వైశాఖ సంతోష్, రాజ నరేందర్ గౌడ్, దయాకర్ గౌడ్, మీసాల సుధాకర్ రావు, సిరికొండ గంగారెడ్డి, వినయ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయి మరిచి విమర్శించడం తగదు

- ప్రొఫెసర్ విద్యాసాగర్ రావు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ విద్యాసాగర్‌రావు

డిచ్‌పల్లి: ఎంపీ అర్వింద్ తన స్థాయి మరిచి కాంగ్రెస్ నేతలపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, తీరు మార్చుకోకపోతే తగిన బుద్ధి చెబుతామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్‌రావు హెచ్చరించారు. మండలంలోని ధర్మారం (బి)గ్రామంలో ఉన్న తన స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మెడికల్ కాలేజ్, అలీసాగర్, గుత్ప ఎత్తిపోతల పథకాలతో పాటు జిల్లా అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిన బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. పసుపు బోర్డు పేరుతో ఐదేళ్ల కాలయాపన చేస్తూ జిల్లా రైతులను అర్వింద్ మభ్యపెట్టారని విమర్శించారు. మోదీ పేరుతో ఎంపీగా ఎన్నికైన అర్వింద్ గెలిచాక అహంకార పూరితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు కావడంతోనే నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి ఓట్లు తక్కువగా వచ్చాయన్నారు. సోషల్ మీడియాకే పరిమితమైన ఎంపీ ఇకనైనా జిల్లా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్స్ వాసుబాబు, శ్యాంసన్, నాయకులు సాయిబాబా, మురళి, బాబా, కాంతారావు, నారాయణరెడ్డి, దావీద్ పాల్గొన్నారు.

మొదటిరోజు 120అడ్మిషన్లు



నిజామాబాద్‌అర్బన్: బడిబాట మొదటిరోజు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిధిలో టీచర్లు విద్యార్థుల అడ్మిషన్లకు ప్రత్యేక చొరవ చూపారు. కేవలం 120 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లు పొందారు. గురువారం అమావాస్య కావడంతో అడ్మిషన్లు తీసుకోలేదని తెలుస్తోంది. ఈనెల 19వరకు బడిబాట కార్యక్రమం కొనసాగనుండగా విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను ఎక్కువ మొత్తంలో పెంచాలని విద్యాశాఖ భావిస్తుంది. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఎంఈవోలు, హెచ్ఎంలతో ప్రత్యేకంగా చర్చిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



ఇందల్వాయి: మండలంలోని గన్నారం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిర్నాపల్లి పరిధిలోని రాంసాగర్ తండాకి చెందిన జగన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవన్ ఇందల్వాయి వైపు వెళ్లేందుకు గన్నారం ముఖద్వారం వద్ద హైవే పైకి వస్తుండగా కామారెడ్డి నుంచి డి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. గాయపడ్డ జీవన్‌ని ఆస్పత్రికి తరలించి కారు డ్రైవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రెండు లారీలు ఢీ..



ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లిలో గురువారం సాయంత్రం ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో వెనుకనుంచి ఢీకొన్న లారీ ముందు భాగం ధ్వంసం కావడంతో డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు శ్రమించి బయటకు తీయడంతో ప్రమాదం తప్పింది.

70 వాహనాలు సీజ్



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్ పరిధిలో పోలీసులు, రవాణ శాఖ అధికారులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి వాహన ధ్రువీకరణ పత్రాలు లేని 70 వాహనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనలను పీఎస్‌లో ఉంచారు. తనిఖీల్లో డీటీవో ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



మాచారెడ్డి: పాల్వంచ శివారులోని వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ గురువారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

పిడుగు పాటుకు పాడిగేదె మృతి



బోధన్ రూరల్: పిడుగుపాటుకు పాడిగేదె మృతి చెందిన ఘటన మండలంలోని అమ్దాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రమేశ్ పాడి గేదె పొలాల్లో మేత మేస్తుండగా పిడుగు పడిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధిత రైతు రమేశ్ కోరారు.

మూడిళ్లలో దొంగతనం

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పీఎస్ పరిధిలో ఒకే రోజు మూడిళ్లలోచోరీ జరిగినట్లు ఎస్సై సంజీవ్ గురువారం తెలిపారు. బస్వాగార్డెన్ సమీపంలో ఉన్న రుత్విక్ రాఘవేంద్ర అపార్ట్ మెంట్, వినాయక్‌నగర్‌లోని రెండిళ్లకు తాళం ఉండడంతో దుండుగులు పగులగొట్టి దొంగతనం చేశారు. చోరీ జరిగినట్లు గుర్తించిన సదరు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మండుతున్న కూరగాయల ధరలు

- కిలో రూ. 80కి చేరిన ధరలు
- బెంబేలెత్తుతున్న కొనుగోలుదారులు



ఎల్లారెడ్డిలో విక్రయిస్తున్న కూరగాయలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఏం కొనేటట్టు లేదు.. ఏమి తినేటట్టు లేదు..అన్నట్లుగా తయారైంది ప్రస్తుతం మార్కెట్‌లో పరిస్థితి. నిత్యావసర వస్తువుల ధరలతో పాటు, కూరగాయలు, పాలు, పండ్లు, చికెన్, మటన్ అన్ని ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఏ కూరగాయలు చూసిన రూ. 80కి కిలో తక్కువ లేకుండా ఉన్నాయి. కూరగాయలు కొనాలంటేనే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి తయారైంది.

అడ్డూఅదుపు లేకుండా...

కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగిపోతున్నప్పటికీ వాటిని నియంత్రించే వారు లేకుండా పోయారు. డిమాండ్ తగ్గట్లుగా కూరగాయలు పండకపోవడంతో ధరలు పెరగడానికి కూడా కారణమవుతోంది. కూరగాయల సాగు సరిగా లేకపోవడం కారణంగా వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి..

కూరగాయలు	ధరలు	కూరగాయలు	ధరలు
బీరకాయలు	80	బీట్‌రూట్	100
పచ్చిమిర్చి	100	పాలకూర	80
వంకాయలు	40	గోంగూర	40
బెండకాయలు	40	క్యారెట్	100
కాకరకాయలు	80	దోసకాయలు	60
క్యాబేజీ	80	టమాటలు	40
క్యాలీఫ్లవర్	80	అల్లం, వెల్లుల్లి	240

కొనే పరిస్థితి లేదు..

కూరగాయలు కొనే పరిస్థితి లేకుండా పోయింది.. ఏ కూరగాయ ధర చూసినా రూ. 60 నుంచి రూ. 80 కిలో విక్రయిస్తున్నారు.. దీని కంటే పప్పులు కొనుక్కుని తినడం మేలుగా ఉంది.

– సంగయ్య, సబ్దల్‌పూర్

ధరలు అదుపులోకి తేవాలి

కూరగాయల ధరలు ప్రభుత్వం అదుపులోకి తేవాలి. ప్రజలకు సరిపడా కూరగాయలు సాగు పెంచేలా రైతులకు అవగాహన కల్పించి కూరగాయల సాగు చేసే వారికి ప్రోత్సాహకాలు అందించాలి.

– గంగయ్య, సబ్దల్‌పూర్

పార్ట్ టైం జాబ్ పేరిట రూ.9.79 లక్షలకు టోకరా

కామారెడ్డి క్రైం: పార్ట్ టైం జాబ్ పేరిట ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.9.79 లక్షలకు టోకరా వేసిన ఘటన కామారెడ్డిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన శ్రీకాంత్‌కు పార్ట్ టైం జాబ్ చేస్తారా అంటూ గత నెల 29న ఫోన్‌కు ఓ మెసేజ్ వచ్చింది. అతను చేస్తానని రిప్లై ఇవ్వడంతో కొన్ని టాస్క్‌లు ఇచ్చారు. వాటిని పూర్తి చేయగానే శ్రీకాంత్ అకౌంట్‌లోకి కొంత నగదును వేశారు. ఇంకా ఎక్కువ మొత్తంలో సంపాదించాలంటే ముందుగా కొంత డబ్బు కట్టాల్సి ఉంటుందని వారు చెప్పారు. మొదట రూ. 9 వేలు, ఆపై రూ. 12 వేలు కట్టించుకుని టాస్క్‌లు ఇస్తూ శ్రీకాంత్ ముందుగా కట్టే మొత్తాన్ని పెంచుతూ వెళ్లారు. డబ్బులు వస్తాయని ఆశపడి ఈ క్రమంలో మొత్తం రూ. 9.79 లక్షలు సదరు మర్చంట్ అకౌంట్‌కు జమ చేశాడు. మరో రూ. 8 లక్షలు జమ చేస్తే మొత్తం రూ. 23.64 లక్షలు వస్తాయని సైబర్ నేరగాళ్లు అనడంతో అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పార్ట్ టైం ఉద్యోగాలంటూ వచ్చే ఇలాంటి మెసేజ్‌లను నమ్మవద్దని సూచించారు.

రెంజల్ విండోపై 6ఏ కేసు నమోదు



ఎరువులను సీజ్ చేస్తున్న వ్యవసాయాధికారి

రెంజల్: ఈ–పాస్ విధానాన్ని తుంగలో తొక్కి ఇష్టారీతిన ఎరువులను విక్రయించడంతో పాటు క్రయ, విక్రయాలకు సంబంధించిన రసీదులు లేకపోవడంతో రెంజల్ విండోపై 6ఏ కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985తో పాటు నిత్యావసరాల చట్టం 1955లను ఉల్లంగించినందున కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ–పాస్ మిషన్ ద్వారా ఎరువుల విక్రయం జరగడంలేదని, ఈ–పాస్ మిషిన్ స్టాక్‌కు, గ్రౌండ్ స్టాక్‌లతో పాటు స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న స్టాక్‌కు చాలా వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. క్యాష్, క్రెడిట్ బిల్లు రైతులకు ఇవ్వకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తనిఖీలో గుర్తించి కేసు నమోదు చేశామన్నారు. స్టాక్‌లో నిల్వ ఉన్న ఎరువులను సీజ్ చేసి, బాధ్యుడైన విండో సీఈవో నిర్లక్ష్యంపై చర్యలకు కలెక్టర్‌కు నివేదికను పంపినట్లు వివరించారు.

రుద్రూర్‌లో నెల్లూర్ వాసి అదృశ్యం



శివకుమార్

రుద్రూర్: నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్ ప్రకృతి ఆశ్రమానికి చికిత్స నిమిత్తం వచ్చిన ఐల శివకుమార్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. నెల్లూర్ జిల్లా పల్లెపాలం గ్రామానికి చెందిన శివకుమార్ గత నెల 25న అక్బర్‌నగర్ చికిత్సాలయంలో అడ్మిట్ అయ్యాడు. మతి స్థిమితం సరిగా లేనందున వారం రోజుల క్రితం ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. వివిధ ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకి లభ్యం కాలేదు. గురువారం శివకుమార్ మామ సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టాలపై మృతదేహం ఉందన్న సమాచారం మేరకు రైల్వే ఎస్సై తావ్యునాయక్, సిబ్బంది అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 35–40 ఏళ్ల మధ్య ఉంటుందని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మంత్రాల నెపంతో దాడి

ఎల్లారెడ్డి: మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో ఒకరిపై దాడి జరిగిన ఘటన మండలంలోని రుద్రారంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నె కిష్టయ్య మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో అతడిపై అదే గ్రామానికి చెందిన సాయిలు, ప్రశాంత్, ప్రవీణ్ దాడి చేశారు. సాయిలు కుటుంబ సభ్యులు ఎప్పుడు అనారోగ్యం గురికావడానికి కిష్టయ్యే కారణమంటు దాడి చేశారన్నారు. బాధితుడు కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరికి నెల రోజుల జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జడ్జి నెల రోజుల జైలు శిక్ష విధించగా మరో 18 మందికి జరిమానా విధించినట్లు ఏసీపీ నారాయణ గురువారం పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పీఎస్‌లో ట్రాఫిక్ సీఐ 19 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపర్చారు. వీరు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు నేరం రుజువు కావడంతో జడ్జి ఒకరికి నెల రోజుల జైలు, 18 మందికి రూ. 46వేల జరిమానా విధినంచినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మోర్తాడ్: మండల శివారులో పేకాట స్థావరంపై దాడి నిర్వహించినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.16,750 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాట ఆడటం చట్టరీత్యా నేరమని ఎవరైనా పేకాట ఆడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ స్తంభంపై నుంచి పడి జేఎల్ఎం మృతి



సంతోష్(ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): విద్యుత్ స్తంభంపై నుంచి జారిపడి జేఎల్ఎం మృతి చెందిన ఘటన నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన పాత సంతోష్(35) అచ్చంపేట గ్రామ జూనియర్ లైన్‌మన్‌గా గత ఐదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గ్రామంలో విద్యుత్ అంతరాయం కలుగడంతో సంతోష్‌తో పాటు మరో ముగ్గురు ట్రాన్స్‌కో ఉద్యోగులు విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్నారు. నవోదయ విద్యాలయ ఆవరణలో ఉన్న కరెంట్ స్తంభం జంపర్లను సరిచేసేందుకు సంతోష్ సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకున్నాడు. అతనితో పాటు ఉన్న ముగ్గురు వారు పనిచేస్తున్న ప్రాంతాల్లో ఎల్‌సీ తీసుకున్నారు. అయితే ఆ ముగ్గురు ఎల్‌సీ రిటర్న్ చేసినా సంతోష్ మాత్రం రిటర్న్ చేయలేదు. చాలా సమయం గడుస్తున్నా ఎల్‌సీ రిటర్న్ చేయకపోవడంతో సబ్ స్టేషన్ ఆపరేటర్‌తో పాటు తోటి ఉద్యోగులు సంతోష్‌కు ఫోన్ చేశారు. అయినా స్పందించక పోవడంతో అనుమానం వచ్చిన ఉద్యోగులు సదరు స్తంభం వద్దకు వచ్చి చూడగా సంతోష్ కింద పడి ముక్కుకు, తలకు, ముఖానికి గాయాలై విగతజీవిగా ఉన్నాడు. విషయాన్ని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణ్ దృష్టికి తీసుకెళ్లారు. సంతోష్‌ను బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య సావిత్రి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంతోష్ మృతితో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పెద్దమల్లారెడ్డిలో విషాదఛాయలు

భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డిలో గురువారం విషాదఛాయలు అలుముకున్నాయి. నిజాంసాగర్ మండలం అచ్చంపేటలో మృతి చెందిన విద్యుత్ ఉద్యోగి సంతోష్ స్వగ్రామం భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి. సంతోష్ 2020లో అప్పటి కలెక్టర్ శరత్, అప్పటి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ చేతుల మీదుగా ఉత్తమ విద్యుత్ ఉద్యోగిగా ప్రశంస పత్రంను అందుకున్నారు. సంతోష్ మృతదేహం పోస్టుమార్టం అనంతరం పెద్దమల్లారెడ్డికి తీసుకొచ్చాక కుటుంబరోధనలు మిన్నంటాయి. మండల కేంద్రంలో సంతోష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

దుబాయిలో బోధన్ వాసి..



అవేస్ (ఫైల్)

బోధన్‌టౌన్: పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన అవేస్(25) దుబాయిలో మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు నెలల క్రితం అవేస్ దుబాయిలో ఉన్న తన బావ అబ్రార్ హైమద్ వద్దకు విసిట్ వీసాపై వెళ్లాడు. కానీ 15 రోజుల క్రితం అబ్రార్ ఇండియాకు వచ్చాడు. అవేస్ అక్కడే ఉన్నాడన్న విషయం తెలుసుకొని ఫోన్ చేయడంతో కలువలేదు. దీంతో అబ్రార్ గురువారం దుబాయికి చేరుకొని అక్కడి పోలీసులకు జరిగిన విషయాన్ని తెలియజేయగా వారు అవేస్ మృతదేహాన్ని చూయించారు. ఈ నెల 2న ఆదివారం దుబాయిలో ఉన్న సముద్రతీరానికి స్నేహితులతో కలిసి వెళ్లాడని అక్కడ నీట మునిగి మృతి చెందినట్లు అక్కడి పోలీసులు తెలిపారన్నారు. దుబాయి నుంచి మృతదేహం తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.